andhrajyothy.com సోమవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 42.0 : కనిష్ఠం 30.2


ఆంధ్రజ్యోతి



నిజామాబాద్

జిల్లా వార్తలు

మంగళవారం 4 జూన్ 2024





• సంగారెడ్డిలోని గీతం యూనివర్సిటీ

జహీరా బాద్‌షా ఎవరో!?

- నేడే లోక్‌సభ ఓట్ల లెక్కింపు
- సంగారెడ్డి గీతం యూనివర్సిటీలో జహీరాబాద్ కౌంటింగ్
- ఉదయం 8 గంటల నుంచి కౌంటింగ్ ప్రారంభం
- అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా లెక్కింపు
- ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గానికి 14 టేబుళ్లు ఏర్పాటు
- మొత్తం పోలింగ్ కేంద్రాలు 1973.. రౌండ్లు 145
- అత్యధికంగా జహీరాబాద్,ఆందోల్‌లో 23చొప్పున రౌండ్లు
- మధ్యాహ్నం 2 గంటల వరకు ఫలితాలు వెలువడే అవకాశం

కామారెడ్డి, జూన్ 3(ఆంధ్రజ్యోతి) : లోక్‌సభ ఎన్నికల ఓట్ల లెక్కింపు మంగళవారం జరగనుంది. కామారెడ్డి, సంగారెడ్డి జిల్లా పరిధిలోని జహీరాబాద్ లోక్‌సభ స్థానం ఓట్ల లెక్కింపును సంగారెడ్డి జిల్లాలోని గీతం యూనివర్సిటీలో అధికారులు నిర్వహించనున్నారు. ఓట్ల లెక్కింపునకు సంబంధించి గీతం యూనివర్సిటీలో అధికారులు పూర్తి ఏర్పాట్లు చేశారు. ఉదయం 8 గంటల నుంచి కౌంటింగ్ ప్రారంభం కానుంది. మధ్యాహ్నం 2 గంటల వరకు ఫలితాలు వెలువడే అవకాశాలు ఉన్నాయి. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఓట్ల లెక్కింపు నిర్వహించనున్నారు. మొత్తం 7 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 145 రౌండ్లుగా ఏర్పాటు చేశారు. జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి బరిలో ఉన్న అభ్యర్థుల భవితవ్యం నేడు తెలనుంది.

లెక్కింపునకు ఏర్పాట్లు పూర్తి

జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించిన పోలింగ్ మే 13 న నిర్వహించారు. సంగారెడ్డి, కామారెడ్డి జిల్లాలోని మొత్తం 7 అసెంబ్లీ నియోజకవర్గాల్లోని 1973 పోలింగ్ కేంద్రాల్లోని ఈవీఎంలలో ఓట్లు పోల్ అయ్యాయి. ఈ ఈవీఎంలను గీతం యూనివర్సిటీ స్ట్రాంగ్ రూమ్‌లకు చేర్చారు. సుమారు 21 రోజుల పాటు విరామం అనంతరం మంగళవారం పార్లమెంట్ నియోజకవర్గ ఓట్ల లెక్కింపు నిర్వహించనున్నారు. గీతం యూనివర్సిటీలో ఓట్ల లెక్కింపుకు అధికారులు పూర్తి ఏర్పాట్లు చేశారు. ఓట్ల లెక్కింపునకై 750మంది సిబ్బంది విధులు నిర్వహించనున్నారు. ఒక్కో నియోజకవర్గానికి వందమంది చొప్పున పని చేయనున్నారు. కౌంటింగ్ సందర్భంగా ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా గీతం యూనివర్సిటీ పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ అమలులోకి తీసుకొచ్చారు. అధికారులు, సిబ్బంది కౌంటింగ్ ఏజెంట్లకు, మీడియాకు ప్రత్యేక పాస్‌లు జారీ చేశారు.

అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఓట్ల లెక్కింపు

జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం ఓట్ల లెక్కింపు అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా జరపనున్నారు. ఈ పార్లమెంట్ సెగ్మెంట్ పరిధి మొత్తం 7 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గానికి 14 టెబుళ్లను ఏర్పాటు చేయనున్నారు. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో 1973 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఈ పోలింగ్ కేంద్రాలకు సంబంధించి మొత్తం 145 రౌండ్‌లలో ఓట్లను లెక్కించనున్నారు. బాన్సువాడలో 258 పోలింగ్ కేంద్రాలకు గాను 19 రౌండ్‌లలో, జుక్కల్ నియోజకవర్గంలో 255 పోలింగ్ కేంద్రాలకు గాను 19 రౌండ్‌లు, ఎల్లారెడ్డిలో 270 కేంద్రాలకు గాను 20 రౌండ్లు, కామారెడ్డిలో 266 పోలింగ్ కేంద్రాలకు గాను 19 రౌండ్లు, నారాయణఖేడ్‌లో 298 కేంద్రాలకు గాను 22, ఆందోల్‌లో 313 కేంద్రాలకు గాను 23 రౌండ్‌లు, జహీరాబాద్‌లో 313 పోలింగ్ కేంద్రాలకు గాను 23 రౌండ్‌లలో ఓట్లను లెక్కించనున్నారు. పోలింగ్ కేంద్రాల లెక్క ప్రకారం జహీరాబాద్,ఆందోల్ అసెంబ్లీ నియోజకవర్గంలో 23 రౌండ్లు, అత్యల్పంగా బాన్సువాడ,జుక్కల్,కామారెడ్డిలో 19 రౌండ్లు ఉన్నాయి. ఈ లెక్కన మొదట బాన్సువాడ ఫలితాలు వెలువడనుండగా చివరగా జహీరాబాద్ ఫలితాలు వస్తాయి. మధ్యాహ్నం 2 గంటల వరకు జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పూర్తి ఫలితాలు వచ్చే అవకాశాలు ఉన్నాయి.

మొత్తం ఓట్లు 16.41 లక్షలు... పోలైన ఓట్లు 12.25 లక్షలు:

లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా తెలంగాణలో పార్లమెంట్ నియోజకవర్గాలకు మే 13 న ఎన్నికలు జరిగిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో మొత్తం ఓట్లు 16,41,410 ఓట్లు ఉండగా.. పోల్ అయిన మొత్తం ఓట్లు 12,25,049. ఇందులో పురుషుల ఓట్లు 8,01,862 ఉండగా పోలైన మొత్తం ఓట్లు 6,08,097.మహిళల ఓట్లు 8,39,489 ఉండగా 6,16,936 ఓట్లు పోల్ అయ్యాయి. థర్డ్‌జెండర్ 59 ఓట్లు ఉండగా 16 ఓట్లు పోల్ అయ్యాయి.


జహీరాబాద్ బాద్‌షా ఎవరో!?

కామారెడ్డి, సంగారెడ్డి జిల్లాల పరిధిలోని జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి ఎవరు గెలుపొందుతారోనని గత 21 రోజులుగా సర్వత్రా ఉత్కంఠ నెలకొంటూ వస్తోంది. ఈ ఉత్కంఠకు మంగళవారం తెర పడనుంది. ఈ ఎంపీ సెగ్మెంట్ నుంచి బరిలో ఉన్న అభ్యర్థుల భవితవ్యం ఈవీఎంలలో నిక్షిప్తమై ఉంది. ఓట్ల లెక్కింపు సందర్భంగా మంగళవారం ఆ ఈవీఎంలు తెరుచుకోనున్నాయి. జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి 19మంది బరిలో నిలిచారు. వీరిలోంచి ప్రధానంగా ముగ్గురి మధ్యనే తీవ్ర పోటీ నెలకొంది. అధికార కాంగ్రెస్ పార్టీ తరపున సిట్టింగ్ మాజీ ఎంపీ సురేష్ షెట్కార్, బీజేపీ నుంచి బీబీపాటిల్, బీఆర్ఎస్ తరపున గాలి అనిల్‌కుమార్‌లు ఉన్నారు. ఈ మూడు పార్టీల అభ్యర్థులు తామంటే తామే గెలుస్తామంటూ ఎవరికి వారే ధీమాతో ఉన్నారు. కానీ ఓటరు మాత్రం ఎవరి వైపు ఉన్నారో ఓటర్ల తీర్పు నేడు తేలనుంది. జహీరాబాద్ పార్లమెంట్ నుంచి ఎంపీగా ఓటర్లు ఎవరిని గెలిపిస్తారో తెలియాలంటే మరికొన్ని గంటలు వేచి చూడాల్సిందే.



గెలుపెవరిదో?

- నేడే పార్లమెంట్ ఎన్నికల కౌంటింగ్
- డిచ్‌పల్లి సీఎంసీలో కౌంటింగ్‌కు ఏర్పాట్లు పూర్తి
- 15 రౌండ్లలో కౌంటింగ్ పూర్తయ్యేలా ఏర్పాట్లు
- ఉదయం 8గంటలకు ఓట్ల లెక్కింపు మొదలు
- ఏర్పాట్లు పూర్తి చేశామన్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు



నిజామాబాద్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పార్లమెంట్ ఎన్నికల కౌంటింగ్ మంగళవారం జరగనుంది. నిజామాబాద్ జిల్లాలోని డిచ్‌పల్లిలో గల సీఎంసీలో జరిగే ఈ కౌంటింగ్‌కు అధికారులు భారీ ఏర్పాట్లు చేశారు. కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాలకు అనుగుణంగా బందోబస్తును ఏర్పాటు చేశారు. ఈ కౌంటింగ్‌లో పాల్గొనే సిబ్బందిని ఉదయం 5గంటలకే రిపోర్టింగ్ చేయాలని ఆదేశాలు ఇచ్చారు. నిబంధనల మేరకు ఏజెంట్ల సమక్షంలో ఉదయం 8గంటలకే కౌంటింగ్‌ను ప్రారంభించనున్నారు. మొదట పోస్టల్ బ్యాలెట్లను లెక్కించిన మీదట ఈవీఎంలను రౌండ్ల వారీగా లెక్కించనున్నారు. మొత్తం 15 రౌండ్లలో కౌంటింగ్‌ను పూర్తి చేసే విధంగా టేబుళ్లను ఏర్పాటు చేశారు. పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు ఒక్కొక్కటి చొప్పున కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడంతో పాటు పోస్టల్ బ్యాలెట్లకు ప్రత్యేకంగా ఒక కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఫలితాలను వేగంగా ఇవ్వడంతో పాటు వెను వెంటనే ఎన్నికల కమిషన్‌కు నివేదించే విధంగా పూర్తి ఏర్పాట్లు చేశారు. రౌండ్ల వారీగా అన్ని వివరాలను తీసుకుంటూనే మొత్తం రౌండ్లు పూర్తి చేసుకునే విధంగా ఏర్పాట్లను చేశారు. డిచ్‌పల్లి సీఎంసీలో జరిగే కౌంటింగ్ సందర్భంగా ఎలాంటి ఆందోళనలు జరగకుండా ఉండేందుకు చుట్టూ ఐదు కిలోమీటర్ల విస్తీర్ణంలో 144 సెక్షన్‌ను విధించారు. కౌంటింగ్ కేంద్రాలకు సిబ్బంది, ఏజెంట్లను మాత్రమే అనుమతించనున్నారు. పోటీ చేసిన అభ్యర్థులు, ప్రధాన ఏజెంట్ల మినహా ఎవరిని కౌంటింగ్ కేంద్రాలకు అనుమతించకుండా చర్యలను చేపట్టారు. కేంద్ర బలగాలతో పాటు జిల్లా పోలీసులను బందోబస్తు కోసం వినియోగిస్తున్నారు.

నియోజకవర్గాల వారీగా టేబుళ్ల ఏర్పాటు

నిజామాబాద్ పార్లమెంట్ ఎన్నికల కౌంటింగ్ డిచ్‌పల్లిలోని సీఎంసీలో నేడు జరగనుంది. కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాలకు అనుగుణంగా సీఎంసీలో అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. కౌంటింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్ కూడా పూర్తి చేశారు. కౌంటింగ్ సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లను చేశారు. నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా.. నిజామాబాద్ అర్బన్, నిజామాబాద్ రూరల్ నియోజకవర్గాలకు 20 టేబుళ్ల చొప్పున ఏర్పాట్లను చేశారు. ఆర్మూర్, బోధన్, బాల్కొండ, కోరుట్ల, జగిత్యాల నియోజకవర్గాలకు 18 టేబుళ్లను ఏర్పాటు చేశారు. నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు ఏడు కేంద్రాలను సీఎంసీలో కౌంటింగ్ కోసం ఏర్పాటు చేశారు. వీటిలోనే మొత్తం ఈవీఎంలను లెక్కించనున్నారు. పోస్టల్ బ్యాలెట్ మొదట లెక్కించిన తర్వాత రౌండ్ల వారీగా ఈవీఎంలను లెక్కించనున్నారు. పార్లమెంట్ ఎన్నికల కౌంటింగ్‌ను 15రౌండ్లలో పూర్తి చేసే విధంగా ఏర్పాట్లను చేశారు.

మొదట మాక్ కౌంటింగ్ చేసిన తర్వాతే..

కౌంటింగ్‌లో పాల్గొనే సిబ్బందిని డిచ్‌పల్లి సీఎంసీలో ఉదయం 5గంటలకే హాజరు కావాలని అధికారులు కోరారు. ఎన్నికల పరిశీలకుల సమక్షంలో కౌంటింగ్ సిబ్బంది మూడవ విడత ర్యాండమైజేషన్‌ను నిర్వహిస్తారు. మొదట ఏజెంట్ల సమక్షంలో మాక్ కౌంటింగ్ చేసిన తర్వాత 8గంటలకు ఓట్ల లెక్కింపును మొదలు పెట్టనున్నారు. ఈ కౌంటింగ్ కోసం మొత్తం 558 మంది సిబ్బందిని వినియోగిస్తున్నారు. వీరితో పాటు అదనంగా మరో 25శాతం సిబ్బందిని రిజర్వులో ఉంచారు. వీరిలో 180 మంది కౌంటింగ్ సూపర్‌వైజర్లు, 190 మంది కౌంటింగ్ అసిస్టెంట్లు, 188 మంది మైక్రో అబ్జర్వర్లు ఉన్నారు. వీరితో పాటు 70 మంది పోస్టల్ బ్యాలెట్లకోసం ప్రత్యేకంగా నియమించారు.

> నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో మొత్తం ఓటర్లు 17లక్షల 4,867 మంది ఉన్నారు. వీరిలో 12లక్షల 26,133 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వీరిలో మహిళ ఓటర్లు 6లక్షల 73,629 మంది ఉండగా, పురుష ఓటర్లు 5లక్షల 52,465 మంది ఉన్నారు. వీరితో పాటు ఇతరులు 39 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు.

గుర్తింపు కార్డులు, ఎంట్రీ పాసులు ఉంటేనే అనుమతి

కౌంటింగ్‌లో పాల్గొనే ఉద్యోగులతో పాటు ఏజెంట్లు కూడా గుర్తింపు కార్డులను, ఎంట్రీ పాసులను తీసుకొని వస్తేనే అధికారులు అనుమతించనున్నారు. పోటీ చేసే అభ్యర్థులతో పాటు వారి ప్రధాన ఏజెంట్లకు కూడా పాస్‌లను జారీ చేశారు. డిచ్‌పల్లి సీఎంసీ పరిసర ప్రాంతాల్లో ఐదు కిలోమీటర్ల వరకు 144 సెక్షన్‌ను విధించారు. ఏజెంట్లు, ఉద్యోగులతో పాటు పోటీ చేసిన అభ్యర్థుల మినహా ప్రధాన పార్టీల నేతలు, కార్యకర్తలు ఆ ప్రాంతాలకు రాకుండా చర్యలను చేపట్టారు. ఏజెంట్లు నడిపల్లి చౌరస్తా నుంచి అమృతాపూర్ గ్రామం మీదుగా సీఎంసీకి చేరుకోవాలని ఆదేశాలను ఇచ్చారు. కౌంటింగ్ సెంటర్‌కు వచ్చే వారికి తప్పనిసరిగా ఎన్నికల కమిషనర్ జారీ చేసిన గుర్తింపు కార్డుతో పాటు ఆధార్, ఓటరు కార్డు లేదా ఏదైనా గుర్తింపు కార్డు తీసుకొని రావాలని కోరారు. ఏజెంట్లను మార్చుకునేందుకు అవకాశాన్ని కూడా ఇవ్వడం లేదు. కౌంటింగ్ కోసం అన్ని ఏర్పాట్లను చేసినట్లు కలెక్టర్, రిటర్నింగ్ అధికారి రాజీవ్‌గాంధీ హన్మంతు తెలిపారు. సిబ్బంది ర్యాండమైజేషన్ పూర్తి చేసినందున వారు నిర్ణీత షెడ్యూల్‌లోపే కేంద్రాలకు చేరుకోవాలని కోరారు. సాయంత్రం 3గంటలలోపు కౌంటింగ్ పూర్తి చేసి ఫలితాలను ప్రకటించే విధంగా ఏర్పాట్లను చేస్తున్నామని ఆయన తెలిపారు. డిచ్‌పల్లి సీఎంసీ వద్ద ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా 144 సెక్షన్‌ను విధించినట్లు సీపీ కల్మేశ్వర్ సింగెనవార్ తెలిపారు. రాజకీయ పార్టీల నేతలు, ఇతర నాయకులు ఐదు కిలోమీటర్లు దాటిన తర్వాతనే మీడియాతో మాట్లాడటం కానీ ఇతర కార్యక్రమాలు కానీ చేపట్టాలని ఆయన కోరారు.





జిల్లా డీఎస్‌వోగా పద్మ

నిజామాబాద్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లా పౌరసరఫరాల శాఖ ఇన్‌చార్జీ అధికారిగా సి.పద్మను నియమించారు. హైదరాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో డిప్యూటేషన్‌పై డిప్యూటీ కమిషనర్‌గా పనిచేస్తున్న ఆమెను జిల్లాకు నియమించారు. ఈ మేరకు సోమవారం ఆమె కలెక్టరేట్‌కు వచ్చి బాధ్యతలను చేపట్టారు. జిల్లా డీఎస్‌వోగా పనిచేసిన చంద్రప్రకాశ్‌ను ప్రభుత్వం సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. గత మూడేళ్లగా పౌరసరఫరాల శాఖ ద్వారా ధాన్యం కేటాయింపులు, కస్టం మిల్లింగ్‌ల విషయంలో జరిగిన అవకతవకలపై డీఎస్‌వోను సస్పెండ్ చేశారు. ఆయన స్థానంలో పద్మను నియమించారు.

పౌరసరఫరాల సంస్థ డీఎంగా రాజేందర్



జిల్లా పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్‌గా బి.రాజేందర్‌ను నియమించారు. మేడ్చల్ జిల్లా డీఎంగా కొనసాగుతున్న ఆయనకు జిల్లా డీఎంగా ఇన్‌చార్జీ బాధ్యతలను అప్పజెప్పడంతో.. సోమవారం బాధ్యతలను చేపట్టారు. డీఎంగా కొనసాగిన జగదీశ్‌ను సస్పెండ్ చేయడంతో.. రాజేందర్‌ను నియమించారు.



ఉత్కంఠ

- నేడే కౌంటింగ్.. ప్రధాన పార్టీల అభ్యర్థుల్లో మొదలైన టెన్షన్
- క్రాస్ ఓటింగ్, సైలెంట్ ఓటింగ్‌తో నేతల్లో ఆందోళన
- నేడు తేలనున్న ఇందూరు విజేత







నిజామాబాద్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పార్లమెంట్ ఎన్నికల కౌంటింగ్ మంగళవారం జరగనుండడంతో.. ప్రధాన పార్టీల అభ్యర్థులతో పాటు ప్రజల్లోనూ ఉత్కంఠ నెలకొంది. పోలింగ్ జరిగిన తర్వాత ఎవరికి వారే అంచనాకు వచ్చి గెలుపుపై ధీమాతో ఉన్నారు. క్రాస్ ఓటింగ్, సైలెంట్ ఓటింగ్ ఎక్కువగా జరగడం వల్ల తమకు కలిసివస్తుందని భావించారు. ఎన్నికల సరళిని పరిశీలించి అంచనాకు వచ్చారు. నిజామాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున టి.జీవన్‌రెడ్డి, బీజేపీ తరఫున ఎంపీ ధర్మపురి అర్వింద్, బీఆర్ఎస్ తరపున బాజిరెడ్డి గోవర్ధన్ పోటీ చేశారు. వీరితో పాటు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలతో పాటు స్వతంత్ర అభ్యర్థులుగా మొత్తం 29మంది పోటీలో నిలిచారు. పార్లమెంట్ ఎన్నికలకు ముందు జరిగిన శాసనసభ ఎన్నికల్లో పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో విభిన్నమైన తీర్పులను ఓటర్లు ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ పరిధిలోని బోధన్, నిజామాబాద్ రూరల్ నియోజకవర్గాలను గెలుచుకోగా.. బీజేపీ నిజామాబాద్ అర్బన్, ఆర్మూర్ నియోజకవర్గాలను గెలుచుకుంది. బీఆర్ఎస్ బాల్కొండ, కోరుట్ల, జగిత్యాల నియోజకవర్గాలను గెలుచుకుంది. పార్లమెంట్ పరిధిలో ఏ పార్టీకి శాసనసభ ఎన్నికల్లో పూర్తిగా సీట్లను ఓటర్లు ఇవ్వలేదు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన పార్లమెంట్ పరిధిలో మాత్రం రెండే సీట్లను ఆ పార్టీ గెలుచుకుంది. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ రెండు సీట్లను గెలుచుకోగా.. అధికారం కోల్పోయిన బీఆర్ఎస్ మూడు సీట్లను గెలుచుకుంది. శాసనసభ ఎన్నికల్లో ఓట్ల పరంగా బీఆర్ఎస్ ముందుండగా రెండో స్థానంలో కాంగ్రెస్, మూడో స్థానంలో బీజేపీ నిలిచింది. శాసనసభ ఎన్నికల అనంతరం జరిగిన పరిణామాలు రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో పరిస్థితులు మారాయి. ఐదు నెలల తర్వాత జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో ఓటర్లు కూడా ఓటు హక్కును ఎక్కువ మొత్తంలో వినియోగించుకున్నారు. గత పార్లమెంట్ ఎన్నికలకంటే 3.95 శాతం ఎక్కువగా పోలింగ్ జరిగింది. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో క్రాస్ ఓటింగ్ ఎక్కువగా జరగడం సైలెంట్ ఓటింగ్ ఎక్కువగా ఉండటం వల్ల మూడు ప్రధాన పార్టీల నేతలు తమకు కలిసివస్తుందని అంచనా వేసుకున్నారు.

ఇంటర్ మూల్యాంకనానికి లెక్చరర్లు హాజరుకావాలి

నిజామాబాద్ అర్బన్, జూన్ 3: ఇంటర్ మూల్యాంకనానికి కేటాయించిన లెక్చరర్లందరూ హాజరు కావాలని జిల్లా ఇంటర్ విద్యాధికారి రవికుమార్ తెలిపారు. ఈ మేరకు ఆయన సోమవారం వివరాలను వెల్లడించారు. ఈ నెల 5న ఈ వాల్యుయేషన్ ప్రారంభమవుతుందని తెలిపారు. మొదట సంస్కృతం, తెలుగు, హిందీ, ఇంగ్లీష్, గణితం, పౌరశాస్త్రం, ఫిజిక్స్, ఎకనామిక్స్ సబ్జెక్టుల మూల్యాంకనం ప్రారంభమవుతుందని తెలిపారు. ఆయా కళాశాలల లాగిన్‌లో నియామక పత్రాలను పంపించామని, సంబంధిత ప్రిన్సిపాళ్లు లెక్చరర్లను విధులకు హాజరయ్యే విధంగా రిలీవ్ చేయాలని రవికుమార్ కోరారు.

నూతన గదులను ప్రారంభించిన గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు

సిరికొండ జూన్ 3 : సిరికొండలో నూతనంగా నిర్మించిన నాలుగు గదులను సోమవారంగ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు ప్రారంభించారు. గ్రామంలో అభివృద్ధి కమిటీకి శాశ్వత ఆదాయాన్ని సమాకూర్చడానికి గదుల నిర్మాణమే శరణ్యమని భావించిన గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు సుమారు ఆరున్నర లక్షలతో నిర్మించిన నాలుగు గదులను ప్రారంబించారు. ఈ గదులను వ్యాపారం చేసుకునే వారికి అద్దెకు ఇచ్చారు. ప్రారంబోత్సవంలో వీడీసీ అధ్యక్షుడు బాడాల సంతోష్ సభ్యులు గంగారాం, రాజేందర్‌గౌడ్, గోపి, శ్రీనివాస్,ప్రవీణ్,మధు,లింగం,గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఎంపీ, పీఎంపీ క్లినిక్ సెంటర్‌ల తనిఖీ



క్లినిక్‌లను తనిఖీ చేస్తున్న మెడికల్ ఆఫీసర్, సిబ్బంది

ఎడపల్లి,జూన్ 3: ఎడపల్లి మండల కేంద్రంలో ఆర్ఎంపీ, పీఎంపీలు నిర్వహిస్తున్న క్లినిక్ సెంటర్‌లను సోమవారం ఎడపల్లి ఇంచార్జీ మెడికల్ ఆఫీసర్ శయాన ఫిర్దోస్ తన సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డీఎంహెచ్ఓ తుకారాం రాథోడ్ ఆదేశాల మేరకు క్లినిక్ నిర్వహిస్తున్న వారు క్లినిక్ లైసెన్సు కలిగి ఉండాలని, తగిన అర్హతలు ఉండి ప్రాక్టీస్ చేసి ఉండాలన్నారు. డెంగీ, మలేరియా, టీబీ వ్యాధిగ్రస్థులు ఉంటే సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ రాజేశ్వర్, ఏఎన్ఎం గంగామణి, సిబ్బంది తదితరులు ఉన్నారు.

జీలుగ సాగుతో చౌడు నేలల్లో ఉత్పాదకతను పెంచుకోవచ్చు

● కమ్మర్‌పల్లి ఇన్‌చార్జి ఏవో లావణ్య



రైతులకు జీలుగ విత్తనాలను అందజేస్తున్న వ్యవసాయాధికారులు

కమ్మర్‌పల్లి, జూన్3: రైతులు తమ పంట భూముల్లో పచ్చిరొట్టా జీలుగ పంటల సాగుతో చౌడు నేలలను పునరుద్ధరించుకొని వాటిల్లో ఉత్పాదకను పెంచుకోవచ్చునని కమ్మర్‌పల్లి మండల ఇన్‌చార్జి అబ్దుల్ మాలిక్ అన్నారు. ప్రభుత్వం సబ్సీడీపై అందజేస్తున్న పచ్చిరొట్ట, జీలుగ విత్తనాలను సహకార సంఘంలలో అందుబాటులో ఉన్నాయని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. 30 కేజీల జీలుగబస్తా రూ.2790 కాగా 60 శాతం సబ్సిడీపై రూ. 1116లకు రైతులకు అందజేస్తున్నామన్నారు.జీలుగ పంటసాగుతో నేల భౌతిక స్థితి మెరుగుపడి నేలకు నీటిని పోషకాలను నిలుపుకునే సామర్థ్యం పెరుగుతుందన్నారు. పచ్చిరొట్టా,జీలుగ విత్తనాలను తొలకరి జల్లులకు పంట పొలాల్లో విత్తుకొని 50 శాతం పూత దశలో భూమిలో కలియదున్నాలన్నారు. ఆ సమయంలో పొలంలో 50కేజీల సూపర్ ఫాస్పేట్ చల్లితే త్వరగా కుళ్లిపోయి ఎరువుగా మారుతుందన్నారు. జీలుగ పంట చౌడు భూములు, వరిపంట భూముకు అనుకూలంగా ఉంటుందన్నారు. ఎకరానికి 10 నుంచి 12 కిలోల జీలుగా విత్తడంవల్ల 8నుంచి 10 టన్నుల పచ్చిరొట్ట లభిస్తోందని, ఒకటన్ను పచ్చిరొట్ట ఎరువులో 6కిలోల నత్రజని 1-1.5 కేజీల భాస్వరం, 1-1.5 కేజీల పొటాష్, భుమిలో స్థిరికరించబడతాయన్నారు. జీలుగ విత్తనాలు కావలసిన రైతులు తమ పట్టా పాసుబుక్కు, ఆధార్ జిరాక్స్‌లతో వచ్చి రాయితీ విత్తనాలు పొందవచ్చన్నారు.

ఏకరూప దుస్తులు అందించాలి :డీఆర్‌డీవో పీడీ


పిప్రిలో ఏకరూప దుస్తులను పరిశీలిస్తున్న డీఆర్‌డీవో ప్రాజెక్టు డైరెక్టర్

ఆర్మూర్‌రూరల్, జూన్‌3: ప్రభుత్వం పాఠశాల విద్యార్థులకు సరఫరా చేయనున్న ఏకరూప దుస్తులను పాఠశాలల పునఃప్రారంభం నాటికి అందించాలని డీఆర్‌డీవో ప్రాజెక్టు డైరెక్టర్ సాయాగౌడ్ అన్నారు.సోమవారం ఆర్మూర్ మండలం పిప్రి గ్రామంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మహిళ సంఘాలు కుట్టించి ఇస్తున్న ఏకరూప దుస్తులను ఆయన పరిశీలించారు. మండలంలో 3121మంది విద్యార్థిని, విద్యార్థులకు సంబంధించిన ఏకరూప దుస్తులను ఆర్మూర్ మండల మహిళ సంఘాల సభ్యులచే కుట్టిస్తున్నారు. సకాలంలో దుస్తులను కుట్టి విద్యార్థులకు అందజేయాలన్నారు. పీడీ వెంట ఏపీఎం గంగారాం, సీసీ కల్పన, వీవోఏలు స్రవంతి, రాజమణి, తదితరులు ఉన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

రుద్రూరు, జూన్ 3 : రుద్రూరు మండల కేంద్రంలో మహ్మద్ మక్బూల్‌కు చెందిన పాడిగేదె సోమవారం విద్యుత్ షాక్‌తో మృతి చెందింది. దీని విలువ రూ.70 వేల వరకు ఉంటుందని బాధితుడు వాపోయాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గేదె మృతితో తనకు ఆర్థికంగా తీవ్ర నష్టం వాటిల్లినట్లు బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వం తనకు నష్టపరిహారం ఇప్పించాలని ఆయన కోరాడు.

పదో విడత హరితహారానికి సర్వం సిద్ధం

● జిల్లా వ్యాప్తంగా 27,13 లక్షల మొక్కల లక్ష్యం.. శాఖల వారీగా కేటాయింపు ● గ్రామ పంచాయతీ, అటవీశాఖ ఆధ్వర్యంలో హరితహారం నర్సరీలు


పల్లికొండ గ్రామంలోని నర్సరీని పరిశీలిస్తున్న అధికారి


హరితహారానికి సర్వం సిద్ధంగా ఉన్న మొక్కలు

భీమ్‌గల్ రూరల్, జూన్ 3: పదోవిడత హరితహారం కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడానికి జిల్లా మండలస్థాయి యంత్రాంగం సిద్ధమయ్యింది. ఇందుకు ఆయా శాఖల వారీగా లక్ష్యాన్ని నిర్దేశించి ఆ దిశగా ముందుకు సాగుతోంది. ఉపాధీ హామీ ద్వారా ప్రతి గ్రామానికి 3,700 మొక్కలను నాటడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. హరితహారం విజయవంతం చేసేందుకు స్వచ్ఛంద సంస్థలు, మహిళా సంఘాలను భాగస్వామ్యం చేయనున్నారు. నాటిన ప్రతి మొక్కను బతికించే బాధ్యత పంచాయతీలపై మోపారు.

● శాఖల వారీగా టార్గెట్లు

వ్యవసాయశాఖ, ఫారెస్టు, మార్కెటింగ్, హార్టికల్చర్, దేవాదాయ, వైద్య, మైనింగ్, పశుసంవర్ధక, విద్య, ఇరిగేషన్, ట్రాన్స్‌పోర్టు, రహదారులు మొత్తం 43 ప్రభుత్వ శాఖలకు పదోవిడుత హరితహారం లక్ష్యాన్ని నిర్దేశించారు. లక్ష్యం మేరకు ఆయా శాఖలకు కేటాయించిన అవసరమైన మొక్కలను గ్రామ వన నర్సరీల్లో మొక్కలను పెంచుతున్నారు. ఉపాదీహామీ పథకం కింద కనీసం 10నుంచి 15 వేల గుంతలు తవ్వాలని లక్ష్యంగా నిర్ణయించారు. అటవీశాఖ ఆధ్వర్యంలో కేటాయించిన నర్సరీల్లో మొక్కలు నాటడానికి సిద్ధంగా వున్నాయి. గ్రీన్‌యాక్షన్ ప్లాన్‌లో భాగంగా గ్రామాల్లో ఎక్కడెక్కడ మొక్కలను నాటే స్థలాలను గుర్తించి సిద్ధంగా వుండాలని జిల్లాస్థాయి అధికారులు గ్రామస్థాయి మండలస్థాయి అధికారులను ఆదేశించారు. వర్షాలు సమృద్ధిగా కురిస్తే జూన్ చివరివారం జూలై మొదటివారంలో పదోవిడుత హరితహారం మొక్కలు నాటే కార్యక్రమం ఊపందుకోనుంది. దీనికోసం అధికారులు ఇప్పటికే అన్ని ప్రణాళిలను సిద్ధం చేశారు.

మొక్కలు నాటే స్థలాలను గుర్తించాం



పదోవిడుత హరితహారంలో మొక్కలు నాటడానికి ఇప్పటికేగ్రామాల్లో స్థలాలను గుర్తించాం. రోడ్డుకు ఇరు వైపులా,ప్రభుత్వ స్థలాల్లో మరియు ప్రభుత్వ సంస్థల్లో, రైతుల పొలం గట్లవెంబడి, కమ్యూనిటీ స్థలాల్లో ఫారెస్టు స్థలాల్లో, చెరువు కట్టలపై ఈత మొక్కలను పెంచడం, పండ్ల తోల పెంపకం, చెరువు శిఖం భూముల్లో మొక్కల పెంపకం వంటి స్థలాలను గుర్తించాము. పైఅధికారులకు నివేదికలు అందజేశాము.

- నర్సయ్య, ఏపీవో, భీమ్‌గల్

లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలి

● కామారెడ్డి జిల్లా ప్రధాన న్యాయాధికారి వరప్రసాద్


పోలీసులు, పీపీలతో మాట్లాడుతున్న ప్రధాన న్యాయాధికారి

కామారెడ్డిటౌన్,జూన్ 3: జిల్లా న్యాయసేవాధికారసంస్థ కామారెడ్డి ఆధ్వర్యంలో ఈనెల 8న నిర్వహించబడుతున్న జాతీయ లోక్‌అదాలత్ విజయవంతం చేయాలని పోలీసు, పీపీలను జిల్లా ప్రధాన న్యాయాధికారి సీహెచ్ వీఆర్.ఆర్.ఆర్ వరప్రసాద్ సూచించారు. లోక్ అదాలత్‌లో గరిష్ఠంగా కేసులు పరిష్కరించాలని కోరారు. రాష్ట్రంలో కామారెడ్డి జిల్లాలో అత్యధిక కేసులు పరిష్కరించి నంబర్ 1 స్థానం ఉండేట్లు చూడాలని కోరారు. సివిల్ కేసులు,వైవాహిక వివాదాలు, భూవివాదాలు, కార్మిక వివాదాలు,బ్యాంక్ రికవరీ వివాదాలు మొదలైన వాటిని కంపౌండబుల్ కానీ.. క్రిమినల్ కేసులను పరిష్కరించ వచ్చని తెలిపారు. లోక్‌అదాలత్‌లో కేసు దాఖలు చేసినప్పుడు కోర్టు రుసుము చెల్లించాల్సిన అవసరం లేదని అన్నారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ డిస్ట్రిక్ న్యాయాధికారి లాల్‌సింగ్‌శ్రీనివాస్‌నాయక్, సీనియర్ సివిల్‌జడ్జ్ నాగరాణి, ఏఎస్‌పీ నరసింహరెడ్డి, డీఎస్‌పీ నాగేశ్వర్‌రావు, కామారెడ్డి పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి,భిక్కనూర్ సీఐ సంపత్ కుమార్, సదాశివనగర్ సీఐ సంతోష్,పీపీలు రాజగోపాల్‌గౌడ్, నిమ్మ దామోదర్‌రెడ్డి, నందరమేష్,శేషు తదితరులు పాల్గొన్నారు.

పనుల్లో నిర్లక్ష్యం వహించొద్దు

● మండల ప్రత్యేక అధికారి వాజీద్ హుస్సేన్


పాఠశాలను పరిశీలిస్తున్న మండల ప్రత్యేక అధికారి వాజీద్

రెంజల్,జూన్‌3: అమ్మ ఆదర్శ పాఠశాలల్లో పనితీరులో నిర్లక్ష్యం వహించవద్దని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి, మండల ప్రత్యేక అధికారి వాజీద్ హుస్సేన్ అన్నారు. సోమవారం మండలంలోని సాటాపూర్, తాడ్‌బిలోలి, పేపర్‌మిల్ గ్రామాల్లోని పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాలల పనులను ఎంపీడీవో శ్రీనివాస్‌తో కలిసి పర్యవేక్షించారు. పాఠశాల ప్రారంభానికి 8రోజులే ఉండడంతో పనుల్లో అలసత్వం ప్రదర్శించకుండా త్వరితగతిన చేపట్టాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వం విద్యార్థులను దృష్టిలో ఉంచుకుని వారికి మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు తాగునీరు, టాయిలెట్ల కొరత లేకుండా చేపట్టాలని సూచించిందని ఆయన అన్నారు. పనులలో అలసత్వం వహించకుండా పనులను పూర్తి చేసి తీరాలని సూచించారు. ఆయన వెంట ఎంఈవో గణేష్ రావు, పీఆర్ ఏఈ వినయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్ ఏజెంట్‌లు అప్రమత్తంగా ఉండాలి'

డిచ్‌పల్లి,జూన్ 3: ఓట్ల లెక్కింపులో పాల్గొనే కాంగ్రెస్ పార్టీ ఏజెంట్‌లు అప్రమత్తంగా ఉండాలని, క్షుణ్ణంగా పరిశీలన చేస్తూ కౌటింగ్ ప్రక్రియ ముగిసే వరకు అప్రమత్తంగా వ్యవహరించాలని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ సూచించారు. సోమవారం కేఎన్‌ఆర్ గార్డెన్‌లో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన 7నియోజకవర్గాల కాంగ్రెస్ ఓట్ల కౌటింగ్ ఏజెంట్‌లతో ఎంపీ అభ్యర్థి టి.జీవన్‌రెడ్డి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, రూరల్ ఎమ్మెల్యే డా.భూపతిరెడ్డి, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డి, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధులు కాటిపల్లి నగేశ్‌రెడ్డి, ఆకుల లలిత, వినయ్‌రెడ్డి, ముప్పగంగారెడ్డి, జావిద్ అక్రమ్, నరాల రత్నాకర్, కేశవేణులతో కలిసి సమీక్ష నిర్వహించారు. కౌటింగ్ కేంద్రంలో ఏజెంట్‌లు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు.

కౌంటింగ్ విధుల్లో పకడ్బందీగా వ్యవహరించాలి


పోలీసులతో మాట్లాడుతున్న ఏసీపీ రాజవెంకట్‌రెడ్డి

డిచ్‌పల్లి,జూన్ 3: పోలీస్ సిబ్బంది నేడు జరగనున్న పార్లమెంట్ కౌటింగ్‌కు సిబ్బంది అందరు అప్రమత్తంగావ్యవహరించాలని ఏసీపీ రాజవెంకట్‌రెడ్డి సూచించారు. డిచ్‌పల్లిలోని జీ కన్వెన్షన్‌లో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన పోలీసులను ఉద్దేశించి మాట్లాడారు. బందోబస్తు విషయంలో నిర్లక్ష్యం పనికి రాదని అప్రమత్తతో విధులు నిర్వహించాలని సూచించారు.

నవీపేటలో రౌడీషీటర్ అరెస్టు

నవీపేట,జూన్‌3: మండల కేంద్రానికి చెందిన షేక్.సలీం అనే రౌడీ షీటర్‌ను సోమవారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ యాదగిరి గౌడ్ తెలిపారు. నెల రోజుల క్రితం నవీపేటకు చెందిన సాయికుమార్ వద్ద సెల్‌ఫోన్‌ను సలీం అడిగి తీసుకున్నాడని ఈ నెల 1న సాయికుమార్ తన ఫోన్‌ను తిరిగి ఇవ్వాలని సలీంను కోరగా అతడు కత్తితో దాడి చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ దాడిలో సాయికుమార్ చెంప వద్ద తీవ్ర గాయం అయిందని, బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయగా సోమవారం నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

వాటర్ ట్యాంకులపై మూతలు అమర్చాలి

సిరికొండ జూన్ 3 : గ్రామాల్లో ప్రజలకు తాగునీటిని అందించే మంచి నీటి ట్యాంకులపై మూతలు అమర్చే విధంగా చర్యలు తీసుకోవాలని గ్రామీణ తాగునీటి సరాఫరాల ఇంజనీరింగ్ అధికారి అర్షద్ పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. సిరికొండ మండలంలోని పలు గ్రామాల్లో కోతులు ఉన్నందున ట్యాంకుల్లో పడకుండా పై కప్పులు బిగించాలని ఏఈ కోరారు.. పైపులు లీకేజీలు ఉంటే వెంటనే, వెంట మరమ్మతులు చేయించాలని ఆయన కార్యదర్శులను కోరారు. రెండు పూటలు నీరందిస్తున్న గ్రామాల్లో బ్లీచింగ్ పౌడర్ క్లోరినేషన్ చేయించాలని ఆయన కోరారు. ప్రతీ నెల 1,11,21 తేదీలలో వాటర్ ట్యాంకులను శుభ్రం చేయాలని ఏఈ వాటర్‌మెన్‌లను సూచించారు. వర్షాకాలం వస్తున్నందున ట్యాంకుల పరిసర ప్రాంతాలన్నింటినీ శుభ్రం చేయించాలని ఏఈ అర్షద్ కార్యదర్శులకు సూచించారు.

వామ్మో..జూన్ నెల..!

● విద్యార్థుల తల్లిదండ్రులపై ఆర్థిక భారం



బోధన్‌రూరల్,జూన్‌3: జూన్ నెల వచ్చిదంటే చాలు.. ప్రతీ సంవత్సరం పేద, మధ్య తరగతి కుటుంబాల తల్లిదండ్రులపై ఆర్థికభారం పడుతుంది. దీంతో జూన్ నెల వచ్చిదంటే తల్లిదండ్రుల గుండెల్లో గుబులు మొదలవుతుంది. పిల్లలను బడికి పంపాలి. వారికి చెల్లించాల్సిన ఫీజులు, దుస్తులు, బ్యాగులు, షూ, కావాల్సిన పుస్తకాలు సమకూర్చాలి. అందుకు డబ్బు కావాలి. ఇక్కడే ప్రారంభం అవుతుంది. తల్లిదండ్రులకు టెన్షన్. టెన్షన్.. డబ్బులు ఎవరి నుండి తేవాలి, ఎలా గట్టెక్కించాలన్న ఆలోచనతో తల్లిదండ్రులు నిమగ్నమవుతున్నారు. కావాల్సిన సమయంలో చేతికి డబ్బులు రాకపోవడంతో తల్లిదండ్రులకు పిల్లలకు మంచి చదువులు చదివించడానికి నానా కష్టాలు పడుతున్నారు. పాఠశాలల్లో ఫీజులు చెల్లించి చిన్నారులను బడులకు పంపే వరకు తల్లిదండ్రుల్లో ఆనందం ఉండదు. పిల్లలను చదివించాలంటే ప్రతి సంవత్సరం చదువుల ఖర్చులు విపరీతంగా పెరుగుతూనే ఉన్నాయి. తమ కుటుంబం నుండి బాలురు, బాలికలు ప్రైవేట్ పాఠశాలలకు పంపించాలంటే ఫీజులు, షూలు, పుస్తకాలు, బ్యాగులు, పెన్నులు, పెన్సిలు, ఇలా అన్నింటిని సమకూర్చాలి. పలు పాఠశాలల్లో యూనిఫామ్‌లు మారుస్తుంటారు. దీంతో కొత్తవాటిని కొనుగోలు చేయాలి. వీటన్నింటికి ఒక్కొ విద్యార్థికి ఖర్చులు దాదపు ఏడాదికి 15వేల నుండి 30వేల రూపాయల వరకు పైనే పడుతుంది. గత సంవత్సరంతో పోలిస్తే ఈసారి పెన్నులు, నోట్ పుస్తకాలు, తదితర వాటి ధరలు పదిశాతంపైగానే పెరిగాయి. జిల్లాలో ప్రతిఏటా జూన్ నెలలోనే తల్లిదండ్రులు పిల్లలను బడులకు పంపేందుకు పుస్తకాలు కొనేందుకు తల్లిదండ్రులకు దాదాపు కోట్ల రూపాయల భారం పడుతుంది. ఒక్కోసారి డబ్బు సాధ్యం కాని పిల్లల తల్లిదండ్రులు విడతల వారీగా ఫీజులు చెల్లిస్తారు. సంవత్సరంలో మూడు విడతలుగా ఫీజులు చెల్లించాలని లేనిపక్షంలో ఫీజులు వెంటనే చెల్లించాలని పాఠశాల యాజమాన్యాలు నోటీసులు జారీ చేస్తారు. మార్కెట్‌లో పెరుగుతున్న పాఠశాలల మెటీరియల్ ధరలను చూసి తల్లిదండ్రులు అయోమయంలో పడుతున్నారు. జూన్‌మాసం అంటే పిల్లలకు విద్యా మాసం, ఆర్థిక భారం అని అర్థం చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. జూన్ మాసం గడిచే వరకు పిల్లలను పాఠశాలలో చేర్పించే వరకు తల్లిదండ్రుల గుండెల్లో రైళ్లు పరుగెడుతూనే ఉంటాయి. ప్రస్తుతం ఇంగ్లీష్ మీడియం మొదట్లోనే వేల రూపాయల ఫీజులు ఉంటున్నాయి. ఒక పక్క ప్రభుత్వం పాఠశాలలో అన్ని సౌకర్యాలు కల్పించి ప్రభుత్వ పాఠశాలలో చేరాలని చెబుతున్నప్పటికీ కొంతమంది తల్లిదండ్రులు ప్రభుత్వ ఉపాధ్యాయుల మాట పెడ చెవిన పెడుతున్నారు.

సిద్ధులగుట్టపై ప్రత్యేక పూజలు


సిద్ధులగుట్టపై సిద్దేశ్వరునికి పూజలు చేస్తున్న భక్తులు

పెర్కిట్, జూన్‌3: ఆర్మూర్ పట్టణంలోని నవనాథ సిద్ధులగుట్టపై ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేక పూజలు, పల్లకిసేవ ఘనంగా నిర్వహించారు. గుట్టపైకి విచ్చేసిన భక్తులందరు శివాలయంలోఅభిషేకాలు,రామాలయం,దుర్గామాత, దత్తాత్రే, అయ్యప్ప ఎల్లమ్మతల్లి, ఏకశిల స్తంభం వద్ద గల హన్మాన్ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాలుగు జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి దర్శించుకున్నారు. సిద్ధుల గుట్టపై నందీశ్వర మహ రాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పల్లకీసేవలో భజన మండలి సభ్యు లు, భక్తులు భక్తీగీతాలు, నృత్యాలతో అలరించారు. దాదాపు నాలుగు జిల్లాల నుంచి వేల సంఖ్యలో భక్తులు విచ్చేశారు. వారికి ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లను చేశారు. సిద్ధులగుట్ట ఆలయ కమిటీ ఆవరణలో బత్తుల వెంకటనారాయణ కుటుంబ సభ్యులు అన్నప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బి.సుమన్, ఎస్సై అశోక్, పీసీ.గంగారెడ్డి, కొడిగెల మల్లయ్య, హజారీ సతీష్, బోండ్ల ఆనంద్, ప్రశాంత్ గౌడ్, సిద్ధులగుట్ట సేవ సమితి సభ్యులు పాల్గొన్నారు.

కౌల్‌పూర్ టూ బద్రీనాథ్ వరకు పాదయాత్ర


బద్రీనాథ్ ఆలయం ముందు ఉన్న భూమా యోగేశ్వర ఆశ్రమం సభ్యులు

నందిపేట, జూన్‌3: మండల కేంద్రంలోని కౌల్‌పూర్ గ్రామా పంచాయతీ పరిధిలో ఉన్న శ్రీ పరమహంస శ్రీ భూమ యోగేశ్వర ఆశ్రమం నుంచి ఉత్తరఖండ్ రాష్ట్రంలోని బద్రీనాథ్ ఆలయం వరకు చేపట్టిన పాదయాత్ర 70వ రోజుకు చేరుకుంది.1900 కిలోమీటర్ల మేర కాలినడకన బద్రీనాథ్ చేరుకున్న భక్తులు సోమవారం ఆలయ సందర్శనం చేశారు. ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేసిన భక్తులు అనంతరం ఆలయంలోగుమిగూడారు. 2024 మార్చి 24న ఆశ్రమం నుంచి వ్యవస్థాపకులు చింత రమేష్ ఆధ్వర్యంలో చేపట్టిన కాలి నడక 1900 కిలోమీటర్లు దాటింది. శ్రీ భూమ యోగేశ్వర ఆశ్రమం నుంచి పాదయాత్ర చేపట్టిన భక్తులు అందరు ఆరోగ్యంగా ఉన్నారని, ఆ దేవుడే మమ్మల్ని నడిపిస్తున్నాడని పేర్కొన్నారు. అలాగే కేదారినాథ్‌చ గంగోత్రి, యమునోత్రి దర్శనాలు చేసుకొని తిరుగు ప్రయాణం చేస్తామని ఆశ్రవ్యవస్థాపకులు చింత రమేష్ తెలిపారు.

ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన విద్య

కోటగిరి,జూన్‌3: ప్రభుత్వ కళాశాలల్లో అన్ని రకాల వసతులతో కూడిన నాణ్యమైన విద్య లభిస్తుందని కోటగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ అనిల్ కుమార్ పేర్కొన్నారు. కోటగిరి ఉమ్మడి మండలంలోని కొడిచర్ల గ్రామంలో సోమవారం అడ్మిషన్ డ్రైవ్ నిర్వహించారు. ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో నాణ్యమైన విద్యను అందించడం జరుగుతుందని ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రైవేటు కళాశాలల్లో ఫీజుల భారం ఎక్కువగా ఉంటుందని, విద్యార్థులకు ప్రభుత్వ కళాశాలల్లోనే చదివించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు దత్తాత్రి, సంతోష్, గిరి, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ కార్యవర్గం ఎన్నిక

ఆర్మూర్‌టౌన్, జూన్‌3: పట్టణంలోని లయన్స్ భవన్‌లో 2024-25 సంవత్సరానికి గాను సోమవారం లయన్స్‌క్లబ్ ఆఫ్ ఆర్మూర్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. లయన్స్‌క్లబ్ ఆఫ్ ఆర్మూర్ అధ్యక్షునిగా చెరుకు పృధ్వీరాజ్, కార్యదర్శిగా మ్యాక శ్రీకాంత్, కోశా ధికారి శెట్‌పల్లి నారాయణలను ఎన్నుకొని పట్టుశాలువతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ఆర్మూర్ సభ్యులు ఎం.రాజన్న, రఫీగోహర్, అంబల్ల తిరుపతి, నర్సింహరెడ్డి, జ్ఞానిచావ్లా, బిజ్జు సంతోష్ చెన్న రవికుమార్, ఉదయ్‌కుమార్, అశ్విన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పనులను పరిశీలించిన చైర్‌పర్సన్

ఆర్మూర్‌టౌన్, జూన్‌3: పట్టణంలోని పలువార్డుల్లో జరుగుతున్న సానిటేషన్ పనులను సోమవారం మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నెల్‌దేవి లావణ్య శ్రీనివాస్ పరిశీలించారు. మున్సిపల్ పరిధిలో సానిటేషన్ స్పెషల్‌డ్రైవ్‌లో భాగంగా ప్రతీవార్డులో పనులను నిర్వహిస్తున్నామని ఆమె తెలిపారు. ఆమె వెంట మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


ఆర్మూర్‌లో సానిటేషన్ పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్



జెండా ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఘనంగా రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ ముగింపు వేడుకలు

సుభాష్‌నగర్, జూన్ 3: బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ ముగింపు వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో సోమవారం జాతీయ జెండాను మాజీ శాసనసభ్యుడు బిగాల గణేష్‌గుప్త, బాజిరెడ్డి గోవర్ధన్‌లు ఆవిష్కరించారు. అనంతరం జాతీయ గీతాలాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు రాష్ట్ర అవతరణ దినోత్సవ ముగింపు వేడుకలు నిర్వహించామన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలంగాణపై చిన్నచూపు చూస్తున్నారని అన్నారు. తెలంగాణ చరిత్ర ఆనవాలు లేకుండా చేసేందుకు రాజముద్రను తయారు చేస్తున్నారని మండిపడ్డారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రసిద్ధిగాంచిన కాకతీయుల తోరణం, చార్మినార్‌ను తొలగించడం తెలంగాణ ప్రజలన్ని అవమానించడమేనని అన్నారు. ఇప్పటి వరకు రైతుబంధు, రైతుభరోసా ఇవ్వకుండా రైతుల ఆత్మహత్యలకు కారణమవుతున్నారని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ భారీ మెజార్టీతో గెలవనుందన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ దండునీతూకిరణ్, రాంకిషన్‌రావు, బాజిరెడ్డి జగన్, సిర్పరాజు, ప్రభాకర్‌రెడ్డి, సుజిత్‌సింగ్‌ఠాకూర్, సత్యప్రకాశ్, ఎనగందుల మురళి, చింతమహేష్ పాల్గొన్నారు.

నేటి నుంచి ఇంటర్ సప్లిమెంటరీ ప్రాక్టికల్స్ ప్రారంభం

నిజామాబాద్ అర్బన్, జూన్ 3: ఇంటర్ సప్లిమెంటరీ ప్రాక్టికల్స్ పరీక్షలు (జనరల్, వొకేషనల్) మంగళవారం నుంచి ప్రారంభమవుతాయని రవికుమార్ తెలిపారు. ఈ పరీక్షలన్నీ నిజామాబాద్ ప్రభుత్వ బాలుర ఖిల్లా జూనియర్ కళాశాలలో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అన్ని కళాశాలల ప్రిన్సిపాళ్లు.. విద్యార్థులకు అవగాహన కల్పించాలని కోరారు.

పాలిసెట్‌లో జిల్లా విద్యార్థుల ప్రతిభ

నిజామాబాద్ అర్బన్, జూన్ 3: గత నెల 24న నిర్వహించిన పాలిసెట్-2024 ఫలితాలు సోమవారం విడుదల అయ్యాయి. పాలిసెట్ ఫలితాలలో జిల్లాకు చెందిన విద్యార్థులు ఉత్తమ ప్రతిభను కనబర్చారు. ఎంబైపీసీ స్ట్రీమ్‌లో ఆలూర్ మండలం గుత్ప గ్రామానికి చెందిన గంట ప్రఫ్నేష్ రాష్ట్రస్థాయిలో 10వ ర్యాంక్‌ను సాధించాడు. వినాయక్‌నగర్‌కు చెందిన రామగిరి సాయికృష్ణ 42వ ర్యాంక్‌ను, పోచమ్మగల్లికి చెందిన రచ్చ కౌశిక్ 46వ ర్యాంక్‌ను సాధించారు. ఎంపీసీ స్ట్రీమ్‌లో గంట ప్రఫ్నేష్ రాష్ట్రస్థాయిలో 12వ ర్యాంక్, కాకతీయ ఒలంపియాడ్ పాఠశాలకు చెందిన అంబాల ఆత్మ రాష్ట్రస్థాయిలో 6వ ర్యాంక్, రచ్చ కౌశిక్ 75వ ర్యాంక్‌ను సాధించారు.

కష్టపడి చదివితే ఉత్తమ ఫలితాలు



విద్యార్థులను సన్మానిస్తున్న సంఘ నాయకులు

ధర్పల్లి, జూన్ 3: విద్యార్థులు కష్టపడి చదివితేనే ఉత్తమ ఫలితాలు సాధిస్తారని ధర్పల్లి పద్మశాలి సంఘం అధ్యక్షుడు నారాయణ అన్నారు. సోమవారం సంఘ భవనంలో ఇటీవల ప్రకటించిన ఎస్సెస్సీ ఫలితాల్లో 10 జీపీఏ, 9.8 జీపీఏ సాధించిన నలుగురు విద్యార్థులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి తల్లిదండ్రులతో పాటు సమాజానికి మంచి పేరు తేవాలన్నారు. మరింత ఉత్సాహంతో పైచదువుల్లో మెరుగైన ఫలితాలు సాధించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నందు, నారాయణ, మధు, భూమేష్, ప్రకాశ్, సంతోష్, మధుకర్, గణేష్, స్వామి, రాజు, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల జాబితా విడుదల

ధర్పల్లి, జూన్ 3: మండల కేంద్రంలోగల మోడల్ పాఠశాలలో ఇంటర్ మొదటి సంవత్సరంలో అడ్మిషన్ల కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల జాబితా విడుదల చేసినట్లు ప్రిన్సిపల్ రాజేందర్ సాహెబ్ సోమవారం తెలిపారు. ఎంపికైన విద్యార్థుల జాబితాను కళాశాల నోటీసు బోర్డులో ఉంచినట్లు ఆయన చెప్పారు. జాబితాలో ఎంపికైన విద్యార్థులు మూడు పాస్‌పోర్టు సైజు ఫోటోలతో పాటు సంబంధిత ఒరిజినల్ సర్టిఫికెట్లను మంగళవారం మధ్యాహ్నం 2గంటల నుంచి అడ్మిషన్లు స్వీకరించనున్నట్లు ఆయన తెలిపారు.

సంతకాల సేకరణ

పెద్దబజార్, జూన్ 3: ప్రధాని మోదీ నాయకత్వానికి మద్దతుగా బీజేపీ యువమోర్చా నాయకులు సోమవారం నగరంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో సంతకాల సేకరణ చేపట్టారు. మూడోసారి ప్రధాని కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ఎర్రం సుధీర్, యువమోర్చ నాయకులు సుధా, భగత్, సాయి, తదితరులు పాల్గొన్నారు. అయితే ఫలితాలకు ఒక్కరోజు ముందే ధన్యవాద్ భారత్ పేరిట ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం చర్చకు దారితీసింది.

కరెంట్ షాక్‌తో గేదె మృతి



కరెంట్ షాక్‌తో మృతి చెందిన గేదె

మోపాల్, జూన్ 3: నగర సమీపంలో ఉన్న బోర్గాం(పి) గ్రామ శివారులో సోమవారం ఉదయం కరెంటు షాక్‌తో గేదె మృతి చెందడంతో బాధితుడు నగేష్ ఆవేదన వ్యక్తం చేశాడు. ఇటీవలనే 80వేల రూపాయలతో గేదెను కొనుగోలు చేశానని మేతకోసం వెళ్లిన గేదె కరెంటు షాక్‌తో మృత్యువాత పడిన సంఘటన స్నేహితులు చెప్పడంతో వెంటనే అక్కడికి వెళ్లాలని ఆయన తెలిపారు. విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం వల్లే పాలిచ్చే గేదె మృతి చెందిందని ఆయన కన్నీరు మున్నీరుతో విలపించారు. ఈ ప్రాంతంలో ఉన్న విద్యుత్ స్థంభాల వైర్లు ప్రమాదకరంగా ఉన్నాయని ఈ ప్రాంత రైతులు అధికారుల దృష్టికి తీసుకువచ్చిన పట్టించుకోకపోవడం వల్లనే మేతకు వెళ్లిన గేదెలు కరెంట్ షాక్‌తో మృత్యువాత పడుతున్నాయని మండిపడ్డారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలని నగేష్ అధికారులను కోరారు.

శిథిలావస్థలో మోస్రా ఆరోగ్య ఉపకేంద్రం



మోస్రాలో ఊడుతున్న భవనం పైకప్పు పెచ్చులు

- పెచ్చులు ఊడిపడుతున్న భవనం
- విద్యుత్ సదుపాయం కరువు
- పట్టించుకోని అధికారులు



మోస్రా, జూన్ 3: మండల కేంద్రంలోని ఆరోగ్య ఉప కేంద్రం లేక పురాతన గ్రామ పంచాయతీ భవనాన్ని ఉపయోగించుకునేందుకు ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా ఆరోగ్య ఉప కేంద్రాన్ని నడుపుతున్నామని స్థానిక సూపర్‌వైజర్ మేరీ పేర్కొన్నారు. ఇక్కడ సమస్యల విషయమై ఏఎన్‌ఎం మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలకు ప్రతివారం పరీక్షలు చేయించుకునేందుకు వస్తుంటారు. అదే విధంగా చిన్న పిల్లలు టీకాలు వేయించేందుకు తల్లిదండ్రులు తీసుకువస్తుంటారు. ఇక్కడ ఏ కాలం అనేది కాకుండా పూర్తి సంవత్సరం ప్రతిది బాధ పెట్టే అంశమే ఇందులో కనీసం విద్యుత్ సరఫరా లేదు. ఎండాకాలం వలన కనీసం ఒక ఫ్యాన్ ఏర్పాటు చేసుకునేందుకు అవకాశం లేదు.

పరిశుభ్రత లేక పాట్లు

ఆరోగ్య ఉప కేంద్రం అంటే దేవాలయం వంటిది అలాంటిది ఇక్కడ గోడల్లో పేరుకుపోయిన చెట్లు మండలం నూతనంగా ఏర్పడిన సమయంలో ఈ భవనాన్ని ఎంపీడీఓ కార్యాలయంగా ఉపయోగించుకున్నారు. అప్పుడే ఈ భవనం శిథిలావస్థలో ఉందని ఎంపీడీఓ కార్యాలయాన్ని రైతు వేదికలోకి మార్చారు. అదే సమయంలో ఆరోగ్య ఉప కేంద్రం కావాలని సంబంధిత అధికారుల కోరిక మేర ఈ శిథిలావస్థ భవనాన్ని ఏర్పాటు చేశారు. ఎంపీడీఓ కార్యాలయానికి సంబంధిత పురాతన సామాగ్రి ఇక్కడే వదిలేశారు. కాగా ఇక్కడ శుభ్రత లేకుండా పోయింది.

స్లాబ్ పైకప్పు పెచ్చులు ఊడటం

వర్షాకాలంలో వర్షపు నీరు లోపలికి రావడంపై కప్పు సరిగ్గా లేక పెచ్చులు ఊడిపడటం వలన గర్భిణీ స్త్రీలకు పరీక్షలు చేయు సమయంలో చాలా భయపడటం జరుగుతుంది. కనీస వసతులు లేకుండా భవనం ఉందని మహిళలకు మూత్రశాల కూడా లేదని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేశారు.

మద్యం ప్రియులకు అడ్డాగా

రాత్రి అయితే ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు మద్యం సేవించి ఆ సీసాలను అక్కడే పడేయడం, పగలగొట్టడం, అక్కడే మల మూత్రాలు చేయడం వలన గ్రామ సేవలకు లయినా మాకు టీకాల కొరకు ఇక్కడికి వచ్చే పిల్లలకు గర్భిణీ స్త్రీలు, ఆరోగ్యం మాట పక్కన పెడితే అనారోగ్యం పాలు అవుతున్నారని ఆశాలు తెలిపారు. కాగా, గ్రామ ప్రజలకు అనారోగ్యంగా మారడం బాధకరం. గోడలో చెట్లు వేర్లు పేరుకుపోయిన ప్రత్యేక భవనం ఏర్పాటు చేయడం లేదని హెల్త్ ఆఫీసర్ కృష్ణవేణి అన్నారు. రేపటి యువతి, యువకులు వారిని ఇప్పుడే బలంగా తయారు చేయాలని ప్రభుత్వం సంకల్పంతో వారం వారం పరీక్షలు టీకాలు వేస్తుందన్నారు. కనీసం పరిశుభ్రతకు నోచుకోకుండా ఉన్న ఈ భవనంలో పాములు వచ్చే అవకాశం కూడా ఉందని అదే విధంగా ఇక్కడ స్థానికులు ఇక్కడే ఆడుకోవడం కొట్టుడు గోటిలు ఆడటం వాళ్ల మా పనులు చేసుకోలేక ఇదో రకం ఇబ్బందని ఆమె అన్నారు. కావున సంబంధిత శాఖ అధికారులు తగు చర్యలు తీసుకొని అదే విధంగా నూతన భవనాన్ని ఏర్పాటు చేయాలని ఆమె కోరారు.

సీఎంసీ కౌంటింగ్ కేంద్రం వద్ద పోలీసుల బందోబస్తు



డిచ్‌పల్లి రైల్వే స్టేషన్ వద్ద వాహనాలను దారి మళ్లిస్తున్న పోలీసులు



కౌంటింగ్ కేంద్రం సమీపంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

- కేంద్రానికి వెళ్లే దారిని వన్‌వేగా మార్పు
- వాహనాలను దారి మళ్లిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

డిచ్‌పల్లి, జూన్ 3: పార్లమెంట్ ఎన్నికల ఓట్ల కౌంటింగ్ సందర్భంగా సీఎంసీ కేంద్రాన్ని పోలీసులు పూర్తిగా తమ ఆధీనంలోకి తీసుకున్నారు. కేంద్రంలోకి పాసులు ఉన్నవారిని మాత్రమే అనుమతి ఇస్తున్నారు. అనుమతి లేని వాహనాలను పోలీసులు వెనక్కి పంపిస్తున్నారు. డిచ్‌పల్లి రైల్వే స్టేషన్‌తో పాటు సీఎంసీ కౌంటింగ్ కేంద్రం వద్ద మూడు అంచెల భద్రత ఏర్పాట్లు కట్టుదిట్టం చేశారు. కౌంటింగ్ సందర్భంగా ఏలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా భద్రత ఏర్పాట్లు కట్టు దిట్టం చేశారు. కౌంటింగ్ కేంద్రానికి చేరుకోవడానికి డి చ్‌పల్లి రైల్వే స్టేషన్ నుంచి రాజకీయపార్టీల ఏజెంట్‌లకు, కౌంటింగ్ సిబ్బందికి వెళ్లడానికి మాత్రమే అనుమతులు ఇచ్చారు. అదే విధంగా ఆంధ్రజ్యోతి కార్యాలయం, గొల్లపల్లి దారి నుంచి సీఎంసీ వెళ్లేందుకు ప్రత్యేకంగా అధికారులకు అనుమతులు ఇచ్చారు. ఉదయం 8గంటలకే మొదటి రౌండ్ కౌంటింగ్ ప్రారంభం కానుంది. కౌంటింగ్ సందర్భంగా డిచ్‌పల్లి సీఎంసీ పరిధిలోని వ్యాపార సముదాయాలను పోలీసులు మూసివేయించారు. కౌంటింగ్ కేంద్రానికి వచ్చే ఎన్నికల సిబ్బంది సోమవారం సాయంత్రం 7గంటలలోపు చేరుకోవాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేయడంతో అధికారులు ముందస్తుగానే సీఎంసీకి చేరుకున్నారు. మంగళవారం జరిగే కౌంటింగ్ ప్రక్రియను సజావుగా జరిగేల చేయ డానికి ముందస్తుగా కలెక్టర్, రాజీవ్ గాంధీ హనుమంతు, కమిషనర్ కల్మేశ్వర్‌లు ఎన్నికల కౌటింగ్ అధికారులకుపలు సూచనాలు చేశారు. పోలీసు అధికారులు పకడ్బందిగా విధులు నిర్వహించాలని సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు వహించాలని సీపీ కల్మేశ్వర్ జీ కన్వెన్షన్ హాల్ లో సిబ్బందితో సమావేశమై పలు సూచనాలు చేశారు.

కార్మికులను కూడగట్టి ఉద్యమాలు చేస్తాం

- ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓమయ్య

పెద్దబజార్, జూన్ 3: సమస్యలు పరిష్కరించని పక్షంలో ఏఐటీయూసీగా జిల్లాలో మిగతా ఏజెన్సీల కార్మికులను కూడగట్టి ఉద్యమాలు చేస్తామని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.ఓమయ్య హెచ్చరించారు. 8 రోజుల నుంచి సమ్మె నిర్వహిస్తున్న హెచ్‌పీ అనంత్‌గ్యాస్, శేఖర్‌గ్యాస్ ఏజెన్సీల సిలిండర్ డెలివరీ బాయ్స్‌ల సమ్మెకు సోమవారం నగరంలోని ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ కార్మికులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎనిమిది రోజులుగా కార్మికులు సమ్మె చేస్తున్న యాజమాన్యం గానీ, కార్మికశాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం సరికాదన్నారు. ఆయిల్ కమిటీని గైడ్‌లైన్స్ ప్రకారం ప్రతి సిలిండర్ డెలివరి చార్జీలను చెల్లించమంటే చెల్లించకుండా నిర్లక్ష్యం వహిస్తున్న యాజమాన్యంపై చర్యలు తీసుకోవాల్సినటువంటి సివిల్ సప్లై అధికారులు కార్మిక శాఖ అధికారులు వినతిపత్రాలు ఇచ్చిన స్పందించడం లేదని అన్నారు. జిల్లా అదనపు కలెక్టర్ ఆదేశాలు ఇచ్చిన స్పందించని అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు హన్మాండ్లు, గ్యాస్ ఏజెన్సీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు సాయన్న, కోశాధికారి రవికుమార్, నాయకులు శివకుమార్, నయీం, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల కౌంటింగ్‌ను సజావుగా నిర్వహించాలి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ పటేల్ కులచారి

పెద్దబజార్, జూన్ 3 : ఎన్నికల కౌంటింగ్‌ను అల్లర్లు, గొడవలు లేకుండా సజావుగా నిర్వహించాలని బీజేపీ నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు దినేష్ పటేల్ కులచారి పేర్కొన్నారు. సోమవారం నిజామాబాద్ జిల్లా కలెక్టర్, పార్లమెంట్ ఎన్నికల అధికారి రాజీవ్ గాంధీ హనుమంతుకు వినతిపత్రం అందజేశారు. మంగళవారం వెలువడనున్న ఎన్నికల ఫలితాల్లో నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో భారతీయ జనతా పార్టీ రెండోసారి విజయం సాధిస్తుందని అనేక ఎగ్జిట్ పోల్స్ రావడం జరిగిందన్నారు. భారతీయ జనతా పార్టీ విజయాన్ని జీర్ణించుకోలేని ప్రతిపక్ష పార్టీలు నేటి ఎన్నిల కౌంటింగ్ సజావుగా జరగకుండా అడ్డుపడి గొడవలు సృష్టించాలని ప్లాన్ చేస్తున్నాయన్నారు. అలాగే నిజామాబాద్ పార్లమెంట్ వ్యాప్తంగా గొడవలు, అల్లర్లు సృష్టించే ఆస్కారం ఉందన్నారు. కావున ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ సజావుగా జరిగేలా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో ఎక్కడా అల్లర్లు, గొడవలు జరగకుండా చూడాలని కోరారు.

దొంగతనం కేసులో ఒకరి అరెస్టు

ఖిల్లా, జూన్ 3: నిజామాబాద్ రైల్వే స్టేషన్‌లో దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తిని రైల్వే స్టేషన్ ఎస్సై సాయిరెడ్డి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. రైల్వేస్టేషన్‌లో సోమవారం సాయంత్రం అనుమానాస్పదంగా తిరుగుతున్న బోధన్ పట్టణానికి చెందిన శ్రీధర్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా ఆయన వద్ద రెండు ల్యాప్‌టాప్‌లు, ఒక ట్యాబ్ లభించిందన్నారు. మే 29న, ఈనెల 1న రైల్వేలో ప్రయాణిస్తున్న వ్యక్తుల వద్ద నుంచి వారి బ్యాగులు దొంగిలించినట్లు నేరం అంగీకరించాడని తెలిపారు. వాటిని హైదరాబాద్‌లో అమ్మటానికి వెళ్తున్నాడని ఒప్పుకోవడంతో వాటిని స్వాధీనం చేసుకొని శ్రీధర్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. దొంగతనం చేసిన వ్యక్తిని పట్టుకోవడంలో రైల్వే సిబ్బంది హన్మాండ్లు, కుబేర్, రవికుమార్, గురుదాస్, సేనానాయక్, మనికిరణ్, రాములను రైల్వే ఎస్సై అభినందించారు.

'పాఠశాలలో పుస్తకాలు అమ్ముతున్న యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి'

ఎల్లారెడ్డి, జూన్ 3: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్ పాఠశాలలో విద్యార్థు లకు పుస్తకాలు అమ్ముతున్నా రని సమాచారం మేరకు ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని జీవదాన్ ప్రైవేట్ పాఠశాలలో సోమవారం ఏబీవీపీ విద్యార్థి నాయకులు తనిఖీ చేయగా పాఠశాలలో పుస్తకాలు కని పించాయి. వెంటనే ఏబీవీపీ నాయకులు స్థానిక మండల విద్యాధికారి పాఠశాలపై చర్య లు తీసుకోవాలని సమాచారం ఇచ్చారు. ఆయన అందుబా టులో లేకపోవడంతో జిల్లా విద్యాశాఖఅధికారులకు ఫిర్యాదు చేశారు. విద్య హక్కు చట్టం ప్రకారం ప్రైవేట్ పాఠశాలపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ విద్యార్థి సంఘ నాయకులు వంశీ పాల్గొన్నారు.

పల్లెల్లో పంచాయతీ సందడి



- పట్టుకోసం పార్టీల ప్రయత్నాలు

డొంకేశ్వర్, జూన్ 3: పల్లెల్లో గ్రామపంచాయతీ ఎన్నికల సందడి మొదలైంది. గత నవంబరులో అసెంబ్లీ తాజాగా పార్లమెంట్ ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో ఇక సర్పంచ్, వార్డుసభ్యుల ఎన్నికల్లో పట్టు సాధించేందుకు రాజకీయ పార్టీలు ప్రయత్నాలు చేస్తున్నాయి. ఆశావహులు అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు ఉవ్విళ్లు ఊరిస్తున్నట్టు కనబడుతోంది. గ్రామాల్లో ఏ ఇద్దరు కలిసిన పంచాయతీ ఎన్నికల గురించి చర్చ జరుగుతుందంటే ఆశ్చర్యపోవాల్సిన అవసరంలేదు. మాజీసర్పంచ్‌లు, వార్డుసభ్యుల స్థానంలో ఈసారి మార్పు కోరుకొని కొత్తవారికి అవకాశం ఇవ్వాలంటు పలు గ్రామాల్లో చర్చలు జరుగుతున్నాయి. పార్లమెంట్ ఎన్నికల్లో రిజల్ట్ తర్వాత పంచాయతీ ఎన్నికలకు నోటిఫికేషన్ రానున్నట్టు సంకేతాలు వచ్చిన ఆ మాత్రం ముందుగా ప్రయత్నాలు మొదలు పెట్టకపోతే ఏలా అంటు పలువురు ఆశ వాహులు పరోక్ష ప్రచారానికి తెరలేపుతున్నారు.

పంచాయతీలు చేజిక్కేనా..?

మండలంలో 13 గ్రామపంచాయతీలు ఉండగా 2019లో జరిగిన ఎన్నికల్లో పరిణామాలు మారాయి. స్వతంత్రంగా గెలిచినవారు టీఆర్‌ఎస్‌లో చేరగా, ఈ సారి రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం మెజారిటీ పంచాయతీలను కైవసం చేసుకోవాలని అభి ప్రాయం ఆ పార్టీ నాయకుల్లో కనబడుతుంది. కాగా సుమారు పదేళ్ల గా ప్రతిపక్షంలో ఉండి ఈ సారి అదృష్టాన్ని పరీక్షించుకోవడానికి ప్రయత్నిస్తున్న పరిస్థితి కనబడుతుంది. ఇక బీఆర్‌ఎస్ నుంచి కాం గ్రెస్‌లోకి వలస వచ్చిన నాయకుల సైతం సర్పంచ్ పదవి కోసం ఆరాటపడుతున్నారు. దీంతో పాత, కొత్త నాయకులు గ్రామాల్లో ప్రయత్నాల్ల వారే ముందుకు సాగుతున్నారు.

గట్టిపట్టుతో మూడు ప్రధాన పార్టీలు..

గతంలో 13గ్రామపంచాయతీల్లో పాగా వేసిన బీఆర్‌ఎస్ పార్టీ మళ్ళీ మెజారిటీ స్థానాలు కైవసం చేసుకుని పట్టుసడలకుండా చూసుకునేందుకు అడుగు వేస్తుంది. ఆ పార్టీని వీడిన వారిని గుర్తించి ప్రస్తావన లేకుండా ఉన్న శ్రేణులతోనే సత్తా చాటాలని చూస్తుంది. మండలంలో ఇప్పటి వరకు గట్టిపట్టు సాధించిన కాంగ్రెస్ గత అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో గట్టిపోటీలో నిలిచింది. ఈసారి పంచాయతీ ఎన్నికలు సర్పంచ్ స్థానాలను కైవసం చేసుకుంటే రానున్న అసెంబ్లీ ఎన్నికల నాటికి మరింత పట్టు దొరుకుతుందని కోణంలో ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. కాగా బీఆర్‌ఎస్ నుంచి మరికొంత మంది అధికార కాంగ్రెస్, బీజేపీలో చేరుతారని ప్రచారం ఉంది. ఎన్నికల నొటిఫికేషన్ ముందే పంచాయతీలపై పట్టుసాధించే దిశగా మూడు ప్రధాన పార్టీలు ప్రయత్నాలు ముమ్మరం చేశాయి.

పలకరింపులతో ప్రజలతో మమేకం..

గ్రామాల్లో పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్‌లు, వార్డుసభ్యులుగా పోటీ చేయాలని ఉత్సాహంతో ఉన్న ఆశావాహులు ప్రజలను మచ్చిక చేసుకోవడంలో బీజీ అయ్యారు. ఏ పని లేకున్నా వార్డుల్లో తిరుగుతూ కనిపించిన వారిని అవ్వ, తాత, బాబాయ్, పిన్ని, అన్నా, వదిన, తమ్ముడు, చెల్లి, అక్క తదితర వరుసలతో మాటాల్లో పెడుతున్నారు. గ్రామాల్లోని సమస్యలు ఇంకా తాము చేయాల్సిన పనులను గుర్తిస్తూ ముందుకు సాగుతున్నారు. కాగా స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ కంటే అభ్యర్థి వ్యక్తిత్వం ప్రజలకు అందుబాటులో ఉంటూ నిస్వార్థ సేవ చేసే వారికి ప్రజలు పట్టం కడుతారన్నది జగమెరిగిన సత్యం అయినా ఎవరి ప్రయత్నంలో వారు ఉన్నారు.

నాగిరెడ్డిపేటలో ఈదురు గాలుల బీభత్సం

- పంట పొలాల్లో నేలకొరిగిన ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలు
- పొలాల్లో పర్యటించిన ట్రాన్స్‌కో అధికారులు

నాగిరెడ్డిపేట, జూన్ 3: నాగిరెడ్డిపేట మండ లంలో ఆదివారం రాత్రి ఉరుములు, మెరుపుల తో, ఈదురు గాలులతో కురిసిన వర్షం బీభత్సం సృష్టించింది. ఈదురు గాలుల బీభత్సానికి మం డలంలోని పలు గ్రామాలలో పలు చోట్ల పంట పొలాలలోని విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. మండలంలోని ఆయా గ్రామాల శివారు ప్రాంతాల్లో విద్యుత్ అధికారు లు సోమవారం పర్యటించి నేలకొరిగిన విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్లను, విద్యుత్ స్తంభాలను పరిశీలిం చారు. ఈదురు గాలుల బీభత్సానికి నాగిరెడ్డి పేట మండల కేంద్రం, గోపాల్‌పేట, చీనూర్, మాల్ తుమ్మెద, గోలి లింగాల్ తదితర గ్రామా ల శివారులోని పంట పొలాల్లోని వ్యవ సాయా నికి సంబంధించిన ఆరు విద్యుత్ ట్రాన్స్‌ఫా ర్మర్లు, 20 వరకు విద్యుత్ స్తంభాలు నేల కూలినట్లు ఆయా గ్రామాల రైతులు తెలిపారు. దీంతో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం కలిగింది. పొలాల వద్ద విద్యుత్ సరఫరా నిలిచి పోయింది. ప్రస్తుతం పంట పొలాల్లో ఎలాంటి పంటలు సాగు జరగడం లేనందున, విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగినా నష్టం లేదని అంటున్నారు. ఈదురు గాలుల కారణంగా పలు గ్రామాలలో నేలకూలిన విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్లను, విద్యుత్ స్తంభాలను విద్యుత్ శాఖ అధికారులు ఎల్లారెడ్డి ఏడీఈ సుదర్శన్‌రెడ్డి, స్థా నిక ఏఈ మనోరంజన్, లైన్ ఇన్‌స్పెక్టర్ సురేం దర్, లైన్‌మెన్ శశికాంత్‌రెడ్డి, రాములు పరిశీలించారు. మండలంలోని పలు గ్రామాలలో ఆరు విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్లు, 15 విద్యుత్ స్తంభాలు కూలినట్లు తమకు సమాచారం అందిందని ఏఈ మనోరంజన్ తెలిపారు. రెండు, మూడు రోజుల్లో కూలిన విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్లను సరి చేసి బిగిస్తామని, కూలిపోయిన విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్త స్తంభాలను ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. మండలంలో ఆదివారం ఈదురు గాలులతో కురిసిన వర్షం 86.2 ఎంఎంగా నమోదైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.



చికెన్ ధరలు

రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.140	రూ.270	రూ. 290
వెన్‌కాబ్(కిలో)	రూ.145	రూ.275	రూ. 295

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.72,800	రూ.67,150	రూ.915

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : గంగం గణేషా (1.05, 4.10, 7.15, 10.20)
స్క్రీన్-2 : భజే వాయువేగం (1.35, 7.35)
: గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి (4.30, 10.30)
స్క్రీన్-3 : భజే వాయువేగం (11.10, 10.40)
: సవి (హిందీ) (2.05, 7.55)
: చోట భీమ్ (హిందీ) (4.50)
స్క్రీన్-4 : ఫ్యూరియేసా (1.30)
: లవ్‌మీ (4.45, 10.30)
: హిట్ లిస్ట్ (7.40)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : భజే వాయువేగం (10.40)
: గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి (1.30, 7.20, 10.30) : గంగం గణేషా (4.30)
స్క్రీన్-2 : గంగం గణేషా (10.45, 1.45, 7.45)
: భజే వాయువేగం (4.45, 10.45)

దేవి : గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : హిట్‌లిస్ట్ (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : లవ్‌మీ (11.15, 2.15, 6.15, 9.15)



- నిజామాబాద్ అర్బన్